

చిట్టి చేతులు.. ముచ్చటైన గణపతులు

సాక్షి, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో చిట్టి చేతుల్లో మట్టి గణపతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

- 8లో



ఆరుగురు వేటగాళ్ల అరెస్ట్

కుప్పం మండలం కంగుంది రిజర్వ్ ఫారెస్ట్‌లో దుప్పిని చంపిన ఆరుగురు వేటగాళ్లను అటవీ అధికారులు అరెస్టు చేశారు.

- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	24
తిరుపతి	34	24
తిరుమల	30	20
గూడూరు	38	27
నగరి	34	24

న్యూస్‌రీల్

చురుగ్గా ఇంటింటికీ సురక్ష



పూతలపట్టులో పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ గౌరి

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం చురుగ్గా సాగింది. వలంటీర్లు గడప గడపకు వెళ్లి ఆరోగ్య సర్వే వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేశారు. సాయంత్రానికి 1041 మంది వలంటీర్లు 32,216 కుటుంబాలను సర్వే చేశారు. వైద్యబృందం సైతం రెండో దశ సర్వే ప్రారంభించింది. ఇంటింటికీ వెళ్లి అనారోగ్య సమస్యలను గుర్తించే పనిలో పడ్డారు. ఇందులో పలు వ్యాధులకు సంబంధించిన లక్షణాలున్న వారిని గుర్తించి బీపీ, మధుమేహం వంటి పరీక్షలు చేశారు. రూరల్ ప్రాంతాల్లోని 28 మంది ఏఎన్‌ఎంలు 1,434 కుటుంబాలకుగాను 3,741 మందిని పరీక్షించారు. 27 మంది మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు 1050 కుటుంబాలకు 2,743 మందికి వివిధ పరీక్షలు చేశారు. అర్బన్‌లోని 40 మంది ఏఎన్‌ఎంలు 1480 కుటుంబాలను సర్వే చేయగా 2884 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈనెల 30వ తేదీ నుంచి చికిత్స, మందులు ఉచితంగా అందిస్తామన్నారు.

వినాయకుడి విగ్రహాలకు మంత్రి పెద్దిరెడ్డి విరాళాలు

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులకు ఒక్కొక్క వార్డుకు రూ.20 వేలు విరాళంగా ఇస్తున్నట్లు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రకటించారు. శనివారం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా మాట్లాడుతూ పట్టణంలోని 31 వార్డులకు రూ.6.20 లక్షలు మంత్రి విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క వార్డులో రెండు విగ్రహాలు ఏర్పాటు చేస్తే రూ.10 వేలు చొప్పున చెల్లిస్తామన్నారు. నిర్వాహకులు పర్యావరణ కాలుష్యాన్ని నివారిస్తూ, ప్రమాదాలకు తావు లేకుండా చవితి పూజలను నిర్వహించుకోవాలని చైర్మన్ కోరారు.

రేపటి నుంచే
విఘ్ననాథుడి బ్రహ్మోత్సవం

జిల్లాలోని ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కాణిపాకం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి విఘ్ననాథుడు రోజుకో వాహనంపై పురవీధుల్లో ఊరేగనున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలంకరణతో కాణిపాకం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లలో పోలీసు యంత్రాంగం నిమగ్నమైంది. అధికార యంత్రాంగం ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసింది.





శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం

బ్రహ్మోత్సవ వివరాలు

తేదీ	ఉదయం	రాత్రి
18	చవితి వేడుకలు	పుష్పకావళ్ల ఊరేగింపు
19	ధ్వజారోహణం	హంస వాహనం
20	అభిషేకాలు	నెమలి వాహనం
21	అభిషేకాలు	మూషికవాహనం
22	చిన్న శేషవాహనం	పెద్ద శేష వాహనం
23	అభిషేకాలు	చిలుక వాహనం
24	అభిషేకాలు	గజవాహనం
25	రథోత్సవం(మధ్యాహ్నం)	
26	భిక్షాండి ఉత్సవం (మ)	అశ్వవాహనం
27	అభిషేకాలు	ధ్వజావరోహణం

- దేదీప్యమానం.. కాణిపాకం
- భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం
- తరలిరానున్న భక్తజనం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. వరసిద్ధుని క్షేత్రం స్వాగత తోరణాలు, విద్యుత్ కటౌట్లు, అలంకరణలతో సర్వాంగ సుందరంగా తయారైంది. వినాయక స్వామి అనుబంధ ఆలయాలు, స్వామి వారు విహరించే వీధులు, వసతిగృహ సముదాయాలు, ఈఓ కార్యాలయం, నిత్య అన్నదాన కేంద్రం, బస్టాండు పరిసరాల్లో విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి.

చవితి రోజు నుంచే..

బ్రహ్మోత్సవాలు సోమవారం చవితి రోజు నుంచి ప్రారంభం కానున్నాయి. చవితి రోజున ప్రత్యేక పూజలను వేదపండితులు, అర్చకులు నిర్వహించనున్నారు. వేకువ జామున 4 నుంచి రాత్రి 10గంటల వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. స్వామివారు చందనాలంకారంలో దర్శనం ఇస్తారు. బ్రహ్మోత్సవాల సమయంలో నిత్య సేవలు రద్దు చేస్తునట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.

భారీ బందోబస్తు

బ్రహ్మోత్సవాలకు చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. 21 రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ ముందు జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఇద్దరు డీఎస్పీలు, 12మంది సీఐలు, 26 మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులందరూ కలిపి 400 మందితోపాటు 4 బెటాలియన్ల ప్రత్యేక పోలీసు బలగాలు, డ్రోన్, సీసీ కెమెరాలు వినియోగిస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం రెండు ప్రత్యేక ప్రదేశాలను ఎంపిక చేశారు. ఆలయం వద్ద చిన్నపిల్లలు తప్పిపోతే వెంటనే గుర్తించేలా వారికి పోలీసులు ట్యాగ్‌లు వేయనున్నారు.

పర్యాటక క్షేత్రంగా బోయకొండ



స్థల పరిశీలన చేస్తున్న టూరిజం అధికారులు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండగంగమ్మ ఆలయాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ఏపీ టూరిజం శాఖ రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్ తెలిపారు. ఈయన శనివారం ఈఓ చంద్రమౌళితో కలిసి టూరిజం ఆఫీసర్ నరేంద్రబాబు, టూరిజం డీఈఈ శ్రీనివాస్, ఏపీటీఏ ప్రిన్సిపల్ కన్సల్టెంట్ రమేష్, ఆర్కిటెక్ట్ సుజిత్‌తో కలిసి కూడిన బృందం బోయకొండలో సందర్శించారు. బోయకొండకు వచ్చే యాత్రికులకు వినోదం, ఆహ్లాదం కలిగించేలా చేయాల్సిన కార్యాచరణపై ఈఓ చంద్రమౌళితో కలిసి చర్చించారు. బోయకొండ వద్ద సుమారు 20 ఎకరాల స్థలంలో ఫౌంటైన్, రోప్‌వే, బోటింగ్, ట్రెక్కింగ్, సాహస యాత్ర, అందమైన పార్కులు, వసతి గృహాలు, హోటల్ ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. దీనికి అనువైన స్థలాన్ని అధికారులతో కలిసి రెవెన్యూ అధికారుల బృందం స్థల పరిశీలన చేశారు. త్వరలో ప్రాజెక్టు రిపోర్టును రూపొందించి ఉన్నతాధికారుల అనుమతితో పనులు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

కాపులకు ఆర్థిక సాయం



నాలుగో విడత కాపునేస్తం మెగాచెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

- ఘనంగా వైఎస్సార్ కాపునేస్తం
- జిల్లాలో 7,091 మందికి రూ.10.65 కోట్లు లబ్ధి

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం కాపులకు ప్రతి ఏటా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాపునేస్తం పథకాన్ని అమలు చేస్తోందని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం నాలుగో విడత వైఎస్సార్ కాపునేస్తం మంజూరు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన కార్యక్రమంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వర్చువల్ పద్ధతిలో వీక్షించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మహిళా సాధికారత దిశగా అనేక పథకాలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్.జగన్‌కు దక్కుతుందన్నారు. 45 నుండి 60 ఏళ్ల కాపు సామాజిక వర్గం మహిళలకు ప్రభుత్వం కాపు నేస్తం పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రభుత్వం మేలు చేసిందన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో కాపు నేస్తం పథకం కింద ఏటా వేలాది మందికి ప్రభుత్వం సాయం చేస్తోందని చెప్పారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ విడతలో జిల్లాలోని 7091 మంది లబ్ధిదారులకు రూ.10.65 కోట్లను ప్రభుత్వం లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు. నాలుగు విడతలలో ఇప్పటి వరకు 25,444 మంది లబ్ధిదారులకు రూ.38.20 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, జెడ్పీ మహిళా స్థాయీ సంఘం చైర్మన్ భారతి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, బీసీ కార్పొరేషన్ ఈడీ రబ్బానిబాషా పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా కాపు నేస్తం వివరాలు

నియోజకవర్గం	లబ్ధిదారులు	నగదు(కోట్లలో)
చిత్తూరు	943	1.41
జీడీ నెల్లూరు	912	1.37
కుప్పం	810	1.22
నగరి	246	0.37
పలమనేరు	1,285	1.93
పుంగనూరు	1704	2.56
పూతలపట్టు	1,191	1.79
మొత్తం	7,091	10.65

నేడు విశ్వకర్మ యోజన పథకం ప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్: చేతివృత్తిదారులకు చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మయోజన పథకాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు జిల్లా పరిశ్రమలశాఖధికారి (డీఐఓ) చంద్రశేఖర్ తెలిపారు. వడ్రంగి, పడవల తయారీదారులు, కమ్మరి, శిల్పులు, చర్మకారులు, చెప్పులు కుట్టేవారు, తాపీ పనిచేసేవారు, బుట్ట/చాప/చీపుర్లు, చేపలవల, బొమ్మల తయారీదారులు, క్షురకులు, రజకులు, దర్జీలు తయారీదారులు సచివాలయం, సీఎస్‌సీ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మొదటి విడతగా బ్యాంకర్లు 5 శాతం వడ్డీతో లక్ష రుణం ఇస్తారన్నారు. దీన్ని 18 నెలల గడువులో చెల్లిస్తే, రెండో విడతలో రూ.2 లక్షల రుణం ఇస్తారని చెప్పారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఎంపికైన వృత్తిదారులకు శిక్షణ ఇస్తామని, ఆ సమయంలో రోజు రూ.500 స్టైఫండ్, రూ.15 వేలు విలువ చేసే పనిముట్లను అందించనున్నట్లు పేర్కొన్నారు.

అమ్మ ఒడికి చేరిన బిడ్డ


బిడ్డను అందుకుంటున్న తల్లిదండ్రులు

చిత్తూరు రూరల్: జిల్లా ఆస్పత్రి మరుగుదొడ్డిలో పసికందు లభ్యమైన ఘటనపై సాక్షిలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో చివరకు ఆ పసికందు అమ్మఒడి చేరింది. కడుపు నొప్పితో వచ్చామని చెప్పి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని బాత్‌రూంలో ఓ తల్లి గతనెల 16న ఆడబిడ్డను ప్రసవించి అక్కడే వదిలి పరారైంది. బిడ్డ బరువు తక్కువ కావడంతో నెల రోజుల పాటు ఎస్ఎన్‌సీయూలో వైద్యు లు సేవలందించి, రక్షించారు. దీనిపై సాక్షి దిన పత్రికల్లో 'ఇంతకీ ఆ తల్లి ఎవరు?' అంటూ వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. సీసీ పుటేజీల ఆధారంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ మద్దాయ్య ఆచారి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తల్లిదండ్రులను గుర్తించడంతో, వారు బిడ్డ తమకే కావాలని కోరారు. అధికారులు చట్ట ప్రకారం శనివారం సాయంత్రం కొన్ని షరతులతో బిడ్డను తల్లి చేతికి అందించారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

చిత్తూరు అర్బన్: యాదమరి, తవణంపల్లి మండలాల్లో శనివారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించి ఒకరిని అరెస్టు చేశారు. యాదమరి మండలం భూమిరెడ్డిపల్లి క్రాస్ వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తూ రాజు మోహన్ (28) పట్టుబడ్డాడు. అతడి నుంచి 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ మోహన్ బాబు, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

చిట్టి చేతులు.. ముచ్చటైన గణపతులు

- సాక్షి, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల తయారీపై శిక్షణ
- జిల్లా కేంద్రంలోని బృందావన్ పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ
- కార్యక్రమానికి విశేష స్పందన
- విజేతలకు బహుమతుల ప్రదానం


చిత్తూరు బృందావన్ పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాలను చేస్తున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : సాక్షి మీడియా గ్రూప్, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం చిత్తూరు నగరంలోని సంతపేట వద్ద ఉన్న బృందావన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చిన్నారులకు మట్టి వినాయక విగ్రహాల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. అన్ని విద్యలకు ఆది గురువైన వినాయకుడి మట్టి విగ్రహం చిన్నారుల చేతుల్లో చూడముచ్చటగా రూపుదిద్దుకుంది. ఈ కార్యక్రమంలో డీఈవో విజయేంద్రరావు పాల్గొని విద్యార్థులు విగ్రహాలు తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. డీఈవో మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి విగ్రహాలనే పూజించాలని కోరారు. మట్టికి మనిషికి ఆది నుంచి విడదీయలేని అనుబంధం ఉందని చెప్పారు. భూమి, నీరు, గాలిని కలుషితం చేస్తే మనుగడ కష్టమన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని తల్లిదండ్రులతో చర్చించాలని సూచించారు. విద్యార్థులు చాలా బాగా విగ్రహాలు తయారు చేశారని అభినందించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మట్టిగణపతుల తయారీలో సృజనాత్మకతను చాటిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.

విజేతలు వీరే

కె.రితీష్ (పదవతరగతి) మొదటి బహుమతి, వి.దీపేష్ (9 వ తరగతి), రెండవ బహుమతి, కె.తేజశ్రీ (8వ తరగతి), మూడవ బహుమతిని అందుకున్నారు. హాసిని మను (ఇంటర్ మొదటి సంవత్సరం), పానీష్ (7వ తరగతి), దర్శిక (6వ తరగతి), రోషిణి (7వ తరగతి), కీర్తి శ్రీ (ఇంటర్ మొదటి సంవత్సరం), మోక్షిత (7 వ తరగతి), కార్తిక్ (7వ తరగతి) కన్సోలేషన్ బహుమతులను దక్కించుకున్నారు.


వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకుంటున్న రితీష్, దివేష్, తేజశ్రీ

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా సాక్షి మీడియా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం. మనిషి మనుగడకే ప్రమాదమనే సంకేతాలందుతున్న ప్రస్తుత తరుణంలో మట్టి గణపతుల ప్రాముఖ్యతను శిక్షణలో తెలియజేసి విద్యార్థులతో చేయించి బహుమతులివ్వడం విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది.

– శైలజాకుమారి, పాఠశాల కరస్పాండెంట్

ఆనందంగా ఉంది



మా అమ్మా నాన్న, మా టీచర్ హస్త కళలకు అత్యంత ప్రాధాన్యతనిస్తుంటారు. ఆ దిశగా మమ్మల్ని బాగా ప్రోత్సహిస్తుంటారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాల వల్ల సృజనాత్మకత, నైపుణ్యం సాధించడానికి అవకాశం ఉంటుంది. ఈ కారణంతోనే నేను చాలా కార్యక్రమాల్లో పాల్గొన్నా. అయితే బహుమతి రావడం ఇదే తొలిసారి. చాలా ఆనందంగా ఉంది.

– రితీష్, ప్రథమ బహుమతి విజేత, చిత్తూరు

మంచి కార్యక్రమం



సాక్షి నిర్వహించిన శిక్షణా కార్యక్రమం చాలా బాగుంది. బాగా శిక్షణ ఇచ్చారు. తెలియని విషయాలను బాగా నేర్చుకున్నాను. నాకు రెండవ బహుమతి వచ్చింది. ఎంతో సంతోషంగా ఉంది. మట్టితో వినాయకుని బొమ్మ తయారీ నేర్చుకోవడం సంతోషంగా ఉంది. స్వయంగా నేను చేసిన బొమ్మను మా ఇంట్లో పూజలో పెట్టుకుంటాను.

– దివేష్, ద్వితీయ బహుమతి విజేత, చిత్తూరు

పర్యావరణ పరిరక్షణ చాలా ముఖ్యం



పర్యావరణ పరిరక్షణ చాలా ముఖ్యమని టీచర్లు చెబుతుంటారు. సాక్షి మీడియా గ్రూప్, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి మాతో మట్టి వినాయకులను చేయించడం చాలా నచ్చింది. ఇందులో నాకు తృతీయ బహుమతి రావడం ఆనందంగా ఉంది. నేను చేసిన మట్టి గణపతిని మా వాళ్లందరికీ చూపిస్తాను.

– తేజశ్రీ, తృతీయ బహుమతి, చిత్తూరు


చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,450

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75.00

అభిమానులను తాకట్టు పెట్టిన పవన్


మాట్లాడుతున్న నారాయణస్వామి

కార్వేటినగరం : జనసేన అధినేత పవన్ అభిమానులను చంద్రబాబుకు తాకట్టు పెట్టాడని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి విమర్శించారు. మండలంలోని గాజంకి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 45 ఏళ్లుగా దోపిడీ రాజకీయాలు నడిపిన చంద్రబాబు ఇప్పుడు అవినీతి కేసులో జైలుకు పోయారని చెప్పారు. జగనన్న పొత్తు ఎప్పుడూ ప్రజలతోనే అని ఇందులో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. దేశంలోనే పేదల సంక్షేమం కోసం పని చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు దందాలు, భూ కబ్జాదారులు, రియల్ వ్యాపారులు, పెత్తందారుల కోసం పనిచేస్తున్నారని చెప్పారు. పక్క పార్టీ జెండా మోయడమే పవన్‌కు అలవాటని ఎద్దేవా చేశారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన టీడీపీ నేత

రొంపిచెర్ల: మండలంలో టీడీపీకి చెందిన వైస్ ఎంపీపీ రమేష్ రెడ్డి శనివారం ఉదయం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. రమేష్ రెడ్డి పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు సొంత గ్రామం బొమ్మయ్యగారిపల్లె ఎంపీటీసీ సభ్యుడిగా పనిచేశారు. రమేష్ రెడ్డి తన అనుచరులతో కలసి వైఎస్సార్‌సీపీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.


మంత్రి పెద్దిరెడ్డిని ఆయన స్వగృహంలో కలిసిన టీడీపీ నాయకులు రమేష్ రెడ్డి

ఒడిశాకు మృతదేహాల తరలింపు

తవణంపల్లె: మండలంలో ఆయిల్ ట్యాంకర్‌ను అంబులెన్స్ ఢీకొని ఐదుగురు మృతి చెందిన సంఘటనలో మృతదేహాలను శనివారం ఒడిశాకు తరలించారు. ఎస్ఐ సుధాకర్ రెడ్డి నేతృత్వంలో సంఘటనా స్థలం నుంచి మృతదేహాలను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారమందుకున్న మృతుల బంధువులు ఒడిశా నుంచి ఐదుగురు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకన్నారు. మృతుడు త్రిలోఛాన్ నాయక్ బంధువులు అభినాష్‌నాయక్, ప్రదీప్‌కుమార్ రావ్, నారాయణ చంద్ర నాయక్, ఆకాసాయ్ నాయక్ సమక్షంలో నలుగురికి మాత్రం ఎస్ఐ సుధాకర్ రెడ్డి శవపరీక్ష నిర్వహించి, వారికి అప్పగించారు. అనంతరం అంబులెన్స్‌లో నాలుగు మృతదేహాలను ఒడిశాకు తరలించారు. అంబులెన్స్ డ్రైవర్ మృతదేహానికి మాత్రం ఆదివారం శవపరీక్ష చేయనున్నట్లు బంధువులు తెలిపారు.


మృతదేహాలను తరలిస్తున్న అంబులెన్స్

ఆరుగురు వేటగాళ్ల అరెస్టు

కుప్పం: మండలంలోని కంగుంది అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న దుప్పిని వేటాడిన ఆరుగురిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కంగుంది రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని దొర చెరువు ప్రాంతంలోకి ఆరుగురు చొరబడి దుప్పిని వేటాడి చంపేశారు. దీనిపై అటవీ శాఖ అధికారులు దర్యాప్తు చేసి రాములగుట్టు చేను గ్రామానికి చెందిన కుట్టెప్ప, గోవిందస్వామి, షణ్ముగం, హనుమంతు, అంబాపురానికి చెందిన గణేష్, రామకుప్పం మండలం బల్ల గ్రామానికి చెందిన వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు చంద్రశేఖర్ రెడ్డి, పుల్లయ్య, సిబ్బంది శేఖర్, నరేంద్రబాబు, బాబ్‌జాన్, ప్రభాకర్, హరిబాబు పాల్గొన్నారు.